సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 20 । జూన్ । 2024



కొలిమి మండితేనే..

తాము తయారు చేసే వ్యవసాయ పనిముట్లకు డిమాండ్ ఉన్నా ఆశించిన ఆదాయం రావడం లేదని తయారీలో సిద్ధహస్తులైన కమ్మర్లు వాపోతున్నారు. 8లో ▸



వైభవంగా శ్రీసుదర్శన హోమం

అత్తిలి మండలం ఈడూరులో వేంచేసి యున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో బుధవారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. 8లో ▸



ప్రాణాంతకం.. గొంతు వాపు

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా సోకే గొంతు వాపు ప్రాణాంతకమని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్నారు. 8లో ▸

చేప పిల్లలు సిద్ధం

- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 కోట్ల సీడ్ పెంపకం
- 45.69 ఎకరాల్లో చేప పిల్లల పెంపకం
- జలాశయాలకు ఉచితంగా సరఫరా

కైకలూరు: రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లో నీరు చేరుతోంది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈ జలాశయాల్లో చేప పిల్లల్ని వదిలేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు నెలల వ్యవధిలో 20 కోట్ల చేప సీడ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇరు జిల్లాల్లో ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలలో మూడు దశల్లో వీటిని పెంచి జలాశయాలకు ఉచితంగా సరఫరా చేస్తారు. ఈ ఏడాది కొత్త చేప వంగడాలను సైతం మత్స్యకారులు కోరుతున్నారు. చేపలు పట్టుకుని జీవనోపాధి పొందడానికి మత్స్యశాఖ ఉచితంగా చేప పిల్లలను జలాశాయాల్లో విడుదల చేస్తుంది. ఏలూరు జిల్లాలో బాదంపూడి, ఏలూరు, కొవ్వలి, పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం, భీమవరం, తణుకులో ప్రభుత్వ చేప పిల్లల తయారీ కేంద్రాలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో కలుపుకుని 45.69 ఎకరాల్లో అధికారులు చెరువుల ద్వారా వీటిని సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కట్లా, రోహు, మోసు, గడ్డి చేప రకాలు పెంచుతున్నారు. మత్స్యకారులు, రైతులు ఈ ఏడాది హైబ్రిడ్ రకాలైన జయంతి రోహు, తిలాపియా, నీలకంఠ రొయ్య అందించాలని కోరుతున్నారు.



బాదంపూడిలో చేప పిల్లల ప్యాకింగ్ (ఫైల్)

జలాశయాలకు సరఫరా ఇలా

మత్స్యశాఖ 2024–2025 సంవత్సరంలో జలాశయాల్లో చేప పిల్లల విడుదలకు ప్రణాళిక రూపొందించింది. ఉమ్మడి జిల్లాలో గోదావరితో పాటు పోగండ, జల్లేరు, తమ్మిలేరు జలాశయాలు ఉన్నాయి. వీటికి చేప పిల్లలు సరఫరా చేయడానికి ప్రధానంగా బాదంపూడి తయారీ కేంద్రం కీలకంగా ఉంది. మత్స్యశాఖ ప్రణాళిక ప్రకారం బాదంపూడి కేంద్రం నుంచి 22 లక్షలు, ఏలూరు కేంద్రం నుంచి లక్షా 10 వేల చేప పిల్లలను గోదావరి తీరంలో ధవళేశ్వరం, పట్టిసీమ ప్రాంతాల్లో విడుదల చేస్తారు. కొవ్వలి కేంద్రం నుంచి తమ్మిలేరుకు లక్షా 35 వేలు, పోగండ జలాశాయానికి లక్షా 25 వేలు, జల్లేరుకు 50 వేలు చేప పిల్లలను అందజేస్తారు.

గుడ్డు దశ నుంచి ఎంతో కీలకం : సీడ్ తయారీకి మత్స్యశాఖ అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకుంటారు. ముందుగా తల్లి చేప బ్రూడర్ నుంచి గుడ్లు సేకరిస్తారు. మూడు రోజుల వయసు కలిగిన చేప పిల్లలను స్పాన్ అంటారు. ముప్పాతిక సైజు వరకు ఉన్న చేపను ఫ్రే అంటారు. అంగుళం నుంచి మూడు అంగుళాల వరకు ఫింగర్‌లింగ్స్ అంటారు. జలాశాయాల్లో 80–100 ఎంఎం సైజు సీడ్‌ను జలాశయాల్లో విడుదల చేయడానికి ప్రాధాన్యత ఇస్తారు. మత్స్య క్షేత్రాల్లో 3 నుంచి 4 నెలలు వీటిని పెంచి సరఫరాకు సిద్ధం చేస్తారు. ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు బ్రూడర్ల నుంచి గుడ్లను సేకరించారు. త్వరలో అన్ని కేంద్రాల్లో సాగు చేపట్టనున్నారు.

మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు

సాధారణంగా వేసవిలో జలాశయాలలో నీరు అడుగంటుతుంది. దీంతో వేట కష్టమవుతుంది. చేపల సంతతి తగ్గుతుంది. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో వర్షాలు కురిసి కొత్త నీరు రావడం చేపల జీవనానికి అనుకూలంగా ఉంటుంది. ఈ సమయంలో మత్స్యశాఖ వివిధ రకాలైన చేప పిల్లలను రివర్ రాంచింగ్, రిజర్వాయర్ రాంచింగ్ పేర్లతో విడుదల చేస్తోంది. కొన్ని నెలల్లోనే చేపలు పట్టుబడి స్థాయికి వస్తాయి.



జలాశయాలకు సరఫరా చేసే చేప పిల్లలు(ఫైల్)

ఉచితంగా చేప పిల్లల సరఫరా



మత్స్యకారుల జీవనోపాధి కోసం మత్స్యశాఖ పిల్లల సీడ్‌ను ఉచితంగా జలాశయాల్లో విడిచిపెడుతోంది. అవసరాన్ని బట్టి సొసైటీ రైతులకు సరఫరా చేస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సైజును బట్టి రూ.3 చెల్లించాలి. బాదంపూడిలో నిల్వ చేసిన చేప పిల్లలను ఏలూరు, కొవ్వలి కేంద్రాలకు పంపుతాం. మత్స్యకారుల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టింది.

– ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, నిడమర్రు

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడదాం

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేసి గద్దెనెక్కాడని ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం పోరాడదామని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మండల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్నికలు, ఓట్ల విషయంపై చర్చించారు. అనంతరం కొట్టు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోనే చిన్న మార్పులతో చంద్రబాబునాయుడు అవలంభిస్తున్నాడని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సమయంలో రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని ఆరోపించిన చంద్రబాబు ఇప్పుడు అంతకు మించి సంక్షేమం అందిస్తానని అధికారంలోకి వచ్చాడన్నారు. మరోసారి రాష్ట్ర ప్రజలు మోసపోయారని వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మన వైఎస్సార్‌సీపీపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో తాడేపల్లిగూడెం ఎంపీపీ పొనకుమాటి శేషులత, నూనె అనూరాధ, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ములకాల రాంబాబు, జడ్డు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రజకుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

భీమవరం: రజకుల సామాజికాభివృద్ధికి ప్రభుత్వాలు జీఓలు విడుదల చేస్తున్నా అమలుకు నోచుకోవడంలేదని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఆకివీడు మండలం పెదకాపవరంలో రజకుల చెరువు ఆక్రమణకు గురైందని దీనిపై చర్యలు తీసుకోవాలని బుధవారం కట్లయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ పెదకాపవరంలోని రజకులకు గతంలో 70 సెంట్ల స్థలంలో చెరువు తవ్వించారన్నారు. 2023లో రెవెన్యూ అడంగల్‌లో రజక చెరువును మార్చి మరొకరి పేరు నమోదచేశారన్నారు. తక్షణమే చెరువుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రజకులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరగా వెంటనే స్పందించి భీమవరం ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారన్నారు. రజకులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లినట్లు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పెదకాపవరం రజకసంఘం నాయకులు యండమూరి సత్యనారాయణ, వండారు సత్యనారాయణ, సూర్యారావు, విశల శ్రీనివాస్ తదితరులున్నారు.

జిల్లాలో 366 మిల్లీమీటర్ల వర్షపాతం

భీమవరం: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం 366 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పెనుమంట్ర మండలంలో 60.2 మిల్లీమీటర్లు నమోదుకాగా భీమవరంలో 48.8, వీరవాసరంలో 47.2, పాలకోడేరులో 40.4, పాలకొల్లులో 38.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పోడూరులో 20.6, ఆకివీడులో 19.8, అత్తిలిలో 16.4, ఇరగవరంలో 14.2, ఆచంటలో 10, పెనుగొండలో 12.4, మొగల్తూరులో 3.6, నరసాపురంలో 4, యలమంచిలిలో 8.2, గణపవరంలో 2.4, ఉండిలో 4.2, కాళ్లలో 7.2, తాడేపల్లిగూడెంలో 1.2, పెంటపాడులో 1.2, తణుకులో 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వసతిగృహాల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు సహాయ సంక్షేమ శాఖాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 14 ప్రీ మెట్రిక్ వసతి గృహాలకు 8 బాలురు, 6 బాలికల హాస్టళ్లు ఉన్నాయన్నారు. ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో వెయ్యి ఖాళీలు ఉండగా వాటిలో 600 మంది బాలురు, 400 మంది బాలికలకు అవకాశముందన్నారు. 15 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో 8 బాలురు, 7 బాలికలు హాస్టళ్లలో 1,100 ఖాళీలు ఉండగా 600 మంది బాలురు, 500 మంది బాలికల ప్రవేశాలకు అవకాశముందన్నారు. ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు ట్రంక్ బాక్స్, ప్లేట్, గ్లాస్, జంబుఖాన, దుప్పటి, ప్రతి నెల కాస్మెటిక్ చార్జీలు అందిస్తామని, టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్యూషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర వివరాలకు 94916,76391, 70132 42896 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

21న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ అల్లు రామకృష్ణ తెలిపారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు పాల్గొంటారన్నారు.

నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి

ఆకివీడు: ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజులు వసూలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి జీ.నాగమణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను అమలు చేయాలని ఉప విద్యాశాఖ అధికారులకు సూచించారు. నిబంధనల్ని అతిక్రమించిన విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 2024–2025 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు ఉంటేనే పాఠశాలల్ని తెరవాలన్నారు. విద్యార్థులు టీసీలు కోరిన వెంటనే ఇవ్వాలని, ఫీజ బకాయిలు ఉన్నాయని టీసీలు ఆపకూడదన్నారు. నిబంధనల మేరకు ఆయా సెక్షన్లలో విద్యార్థుల్ని చేర్చుకోవాలని చెప్పారు.

ఐదేళ్లూ ప్రజల్లోనే ఉన్నాం

నాయకుల సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి



తణుకులో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ శ్రేణులందరికీ అండగా నిలబడతానని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన రోజు నుంచి మంత్రిగా ఉన్న రోజులు సైతం తణుకు నియోజకవర్గంలో నిరంతరం ప్రజల్లోనే ఉన్నామని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన సంక్షేమాన్ని కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా తణుకు నియోజకవర్గంలో అర్హులందరికీ అందించామని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లోనే ఉన్నామని గుర్తుచేశారు. ఐదేళ్లపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా అవినీతికి తావులేకుండా ప్రజలతోనే ఉంటూ వారికి అండగా నిలబడ్డారని ప్రశంసించారు. ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినప్పటికీ రాబోయే రోజుల్లో ప్రజల్లోనే ఉండాలని సూచించారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనన్నారు. వాటిని నెరవేర్చేందుకు కొంచెం సమయం ఇచ్చి చూడాలని, అన్యాయం జరిగిందని ప్రజలు రోడ్డెక్కిన రోజు వారికి అండగా నిలబడాలని నాయకులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కార్యకర్తలంతా ఐదేళ్లు నిప్పుల్లా పని చేశారని వారందరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు మంగెన సూర్య, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, బల్లిపాడు సర్పంచ్ బాలాజీ, దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, దువ్వ సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, వి.సీతారాం, సుద్దుల పాండు, పుల్లెపు సూర్యచంద్రరావు, గనసాల సింగ్, బొల్లా దుర్గాప్రసాద్, పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులకు మెరుగైన సేవలు

భీమవరం (ప్రకాశంచౌక్): చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే సేవలు నాణ్యంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి, సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లతో క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందించే సేవలలో ఎట్టి పరిస్థితుల్లో నాణ్యతా లోపం ఉండకూడదన్నారు. అంగన్‌వాడీలోని చిన్నారులలో ఎత్తు, బరువు తక్కువగా వున్న చిన్నారులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. వారం వారం ప్రగతి కనిపించాలన్నారు. అంగన్‌వాడీలో పిల్లలకు నేర్పించే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్నారులు త్వరితగతిన అవగాహన చేసుకుని నేర్చుకునే స్థాయి హెచ్చుగా ఉంటుందని, ఇందుకు తగిన విధంగా బోధించేందుకు అనువైన మార్గాలను అవలంభించాలన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులు తీసుకోవాల్సిన టాబ్లెట్లు, ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ఎలా శిక్షణ ఇవ్వాలో ఆలోచన చేయాలని తెలిపారు. గర్భిణులకు అందించిన పౌష్టికాహారం, గుడ్లు ఆమె తీసుకుంటుందో లేదో తరచూ పరిశీలించాలన్నారు. శిశు మరణాలు, ప్రసూతి మరణాలు జరగకుండా ప్రతి ఒక్కరి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి బి.సుజాతరాణి, సిడిపిఓలు, సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

బీపీహెచ్‌యులు వేగంగా పూర్తి చేయాలి

జిల్లాలో చేపట్టిన బీపీహెచ్‌యు(బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్)ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశమై నిర్మాణాలపై ఆరా తీశారు. జిల్లాలో యండగండి, పోడూరులో శ్లాబ్ దశలో ఉన్నాయని, అత్తిలిలో నిర్మాణం ప్రారంభమైందని, ఎల్‌బీ చర్ల, దొడ్డిపట్లలో నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందని అధికారులు వివరించారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ నిర్మాణంలో ఉన్నవి వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణాలు చేపట్టాల్సిన రెండు యూనిట్ల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.డి.మహేశ్వరరావు, జిల్లా రోడ్లు భవనాల శాఖ అధికారి ఎల్.లోకేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణా తరగతులు

తణుకు అర్బన్: ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో వ్యాధులను గుర్తించేందుకు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా 15 రోజులపాటు వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ తెలిపారు. ఈ నెల 13 నుంచి వచ్చేనెల 3 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్, క్యాన్సర్ స్క్రీనింగ్, డయాబెటీస్, హైపర్ టెన్షన్ వంటి రుగ్మతలను గుర్తించే క్రమంలో అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలోని వైద్యులు, మిడ్ లెవెల్ ప్రొవైడర్స్, ఏఎన్‌ఎంలను బ్యాచ్‌లుగా విభజించి ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ తరగతుల్లో నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, ఆస్పత్రి ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ శారద ప్రసూన, శిక్షణ అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులకు హాజరైన వైద్యులు, సిబ్బంది

స్వర్ణకు దీటుగా ఎంటీయూ 1318

- తెగుళ్ల బెడద తక్కువ.. దిగుబడి ఎక్కువ
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లాలో 2.3 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- లక్ష ఎకరాల్లో 1318 వెరైటీ సాగుకు వ్యవసాయశాఖ కసరత్తు

సాక్షి, భీమవరం: రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటను సాగు చివరలో వైపరీత్యాలు నేలపాలు చేస్తున్న వేళ.. ఎంటీయూ 1318 రకం ఎదురొడ్డి నిలుస్తోంది. ఎడతెరిపి లేని వర్షాలకు చుట్టూ ఉన్న పొలాలు నేలనంటితే ఈ వెరైటీ వెన్ను కూడా వాల్చకుండా అబ్బురపరుస్తుంది. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేసిన ఈ వంగడం అనతికాలంలోనే రైతుల ఆదరణ చూరగొంటుంది. తొలకరిలో లక్ష ఎకరాల్లో ఈ వెరైటీని సాగుచేయించేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది.

జిల్లాలోని 2.31 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు జరుగుతుంది. 80 శాతం విస్తీర్ణంలో స్వర్ణ (ఎంటీయూ 7029), మిగిలిన మేర సంపద్ స్వర్ణ, ఇతర వెరైటీలు సాగుచేస్తుంటారు. స్వర్ణ రకం కాండం దృఢంగా లేకపోవడం వల్ల వర్షాలు, ఈదురుగాలులకు త్వరగా పడిపోతుంది. ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే తుఫాన్ల కారణంగా స్వర్ణ దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. మరోపక్క కొత్తగా వస్తున్న సన్న రకాల బియ్యంతో 20 ఏళ్ల క్రితం అభివృద్ధి చేసిన స్వర్ణ బియ్యం పోటీ పడలేకపోతోంది. మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉండటంతో ప్రభుత్వం చేసే ధాన్యం సేకరణపైనే రైతులు ఆధారపడాల్సి వస్తోంది.



ఎంటీయూ 1318 రకం

స్వర్ణకు ప్రత్యామ్నాయంగా..

కాలం చెల్లిన స్వర్ణకు ప్రత్యామ్నాయంగా మార్టేరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఎంటీయూ 1318 వంగడానికి జీవం పోశారు. వర్షాలు, తెగుళ్లను తట్టుకునేలా స్వర్ణ, ఎంటీయూ 1064 వంగడాలను సంకరణం చేసి ఈ కొత్త వెరైటీని రూపొందించారు. ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించి మూడేళ్ల క్రితం విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేశారు. జూన్ 5వ తేదీన విత్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా మూడు రోజుల పాటు మార్టేరు పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ విత్తన విక్రయాలు చేస్తున్నారు. ఈ వెరైటీ ప్రత్యేకతను గూర్చి వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. అధిక వర్షాల సమయంలో పంట నేలకొరగకుండా ఉండి దిగుబడులు బాగుండటంతో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా జిల్లాలో ఈ వెరైటీ సాగు పెరుగుతూ వస్తోంది.

మార్టేరు కేంద్రంలో విత్తన విక్రయాలు :

ప్రస్తుత సీజన్‌లో జిల్లాలోని లక్షకు పైగా ఎకరాల్లో ఈ వెరైటీ సాగు లక్ష్యంగా కసరత్తు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఆ దిశగా రైతులను చైతన్యవంతం చేస్తున్నామంటున్నారు. ఇప్పటికే మార్టేరు పరిశోధన కేంద్రం ద్వారా ఎంటీయూ 1318 విత్తన విక్రయాలు చేయగా వ్యవసాయశాఖ అవసరమైన విత్తనాలను సిద్ధం చేసింది. జిల్లాలో తొలకరి నాట్లు వేసేందుకు 12,120 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా ఇంత వరకు సుమారు రెండు వేల ఎకరాల్లో పూర్తయినట్టు అంచనా. త్వరితగతిన నారుమడులు పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఎంటీయూ 1318 ప్రత్యేకతలు

- స్వర్ణ మాదిరి ఎంటీయూ 1318 సాగుకాలం 150 రోజులు
- దుబ్బులో 10 నుంచి 12 పిలకలు వేసి 100 సెంటీమీటర్లు ఎత్తు వరకు పెరుగుతుంది.
- కాండం దృఢంగా ఉండటం వలన స్వర్ణ మాదిరి వర్షాలకు చేను పడిపోదు. గింజలు రాలడం తక్కువవడంతో చేనుపై మొలకెత్తవు.
- గింజ మధ్యస్త సన్నంగా ఉండి పచ్చి బియ్యానికి అనుకూలంగా ఉంటాయి.
- బియ్యం పారదర్శకంగా ఉండి పొట్ట తెలుపు లేకుండా ఎక్కువ నిండు గింజలతో దిగుబడినిస్తాయి.
- సాధారణ పరిస్థితుల్లో స్వర్ణ రకం ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడినిస్తే ఎంటీయూ 1318 రకం 35 నుంచి 40 బస్తాల దిగుబడినిస్తుంది.
- మిగిలిన వెరైటీలతో పోలిస్తే దోమపోటు, ఎండాకు తెగులు బెడద చాలా తక్కువ.

50 శాతం విస్తీర్ణంలో సాగు లక్ష్యం



ఖరీఫ్‌లో ఎంటీయూ 1318 వెరైటీ సాగు పెరుగుతోంది. ఈ సీజన్‌లో 2.31 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు జరుగుతుంది. 50 శాతం విస్తీర్ణంలో ఈ వంగడాన్ని సాగుచేసేలా రైతులను చైతన్యవంతం చేస్తున్నాం.

– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ

స్వర్ణకు దీటైన వంగడం



స్వర్ణకు దీటైన వంగడం ఎంటీయూ 1318. తొలకరి సాగుకు ఎంతో అనుకూలం. వైపరీత్యాలను తట్టుకుని నిలబడటంతో పాటు పాటు తెగుళ్ల బెడద తక్కువ. స్వర్ణ కన్నా దిగుబడులు బాగుంటాయి.

– డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (వరి), మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం

క్లుప్తంగా

వేములదీవి వెంకన్న సేవలో హీరో నిఖిల్


వెంకన్నను దర్శించుకుంటున్న నిఖిల్

నరసాపురం రూరల్: వేములదీవిలో వేంచేసియున్న వైభవ వెంకటేశ్వరస్వామిని సినీ కథానాయకుడు నిఖిల్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. దర్బరేవు గ్రామానికి చెందిన కలిదిండి చినసత్యనారాయణ రాజు కుమార్తెను కొంతకాలం క్రితం నిఖిల్ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిఖిల్‌తో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీ పడ్డారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చెన్నాప్రగడ చక్రీ ఇంటికి నిఖిల్ కుటుంబ సమేతంగా వెళ్లి కొంత సేపు గడిపారు.

పిడుగు పడి గృహోపకరణాల దగ్ధం

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీ అగ్రహారంలో బుధవారం ఉదయం పిడుగుపడి ఇళ్లల్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నివాసాలలో ఫ్రిజ్‌లు, టీవీలు, తదితర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయని ఆప్రాంతానికి చెందిన అన్నవరం, నాయుడు, బాబు తదితరులు వాపోయారు.

9 మంది దొంగల అరెస్ట్

పాలకొల్లు అర్బన్: మండలంలోని పలు చోట్ల దొంగతనాలకు పాల్పడుతున్న 9 మంది దొంగలను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై బి.హరికృష్ణ బుధవారం చెప్పారు. ఇటీవల చించినాడ బైపాస్ రోడ్డులోని ఒక కొబ్బరికాయల దుకాణంలో, అలాగే వాలమర్రులోని కొబ్బరికాయల దుకాణంలో కురిడీకాయలు దొంగతనాలు జరిగాయి. సోమవారం రాత్రి దిగమర్రు బైపాస్ రోడ్డులో 9 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశామన్నారు. నిందితుల నుంచి 14 నీటి పంపు మోటార్లను, రెండు వ్యాన్లు, రూ.1,11,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

భిన్నత్వంలో ఏకత్వ సాధనే యోగా లక్ష్యం

ఆకివీడు : భిన్నత్వంలో ఏకత్వం సాధించేందుకు యోగా ఎంతగానో తోడ్పడుతుందని స్పిర్చువల్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పీబీ.ప్రతాప్‌కుమార్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది తీసుకున్న ప్రత్యేక నిర్ణయం 'యోగా నా కోసం, నా సమాజం కోసం' అంటూ చేపట్టిన కార్యక్రమానికి తమ సంస్థ పూర్తి సేవలందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఆకివీడు ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా యోగా కేంద్రాన్ని నడుపుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో అనారోగ్య, మానసిక, శారీరక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారికి యోగా ద్వారా ఆరోగ్యవంతులను చేశామన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. స్పిర్చువల్ సొసైటీ జిల్లా కార్యదర్శి ఉండ్రమట్ల సాంబశివరావు, యోగాసనాచార్యులు కందుల సత్యనారాయణ, పతంజలి యోగారోగ్య కేంద్రం కార్యదర్శి కుంకట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

కొలిమి మండితేనే కలిమి

- యాంత్రీకరణతో కుదేలవుతున్న కమ్మరులు
- నైపుణ్యం ఉన్నా అంతంతమాత్రంగా పనులు
- పెరిగిన ముడిసరుకుల ధరలతో పెనుభారంగా జీవనోపాధి
- ఏటా తగ్గిపోతున్న పరికరాల తయారీదారులు


కొలిమిలో కత్తి తయారు చేస్తున్న కమ్మరి


విక్రయానికి సిద్ధంగా ఉన్న కత్తులు, కొడవళ్లు

వీరవాసరం: వ్యవసాయ పనిముట్లకు అవసరమైన పరికరాల తయారీలో కమ్మర్లు సిద్ధహస్తులు. వీరు తయారు చేసిన పరికరాలు నాణ్యంగా ఉండటంతో డిమాండ్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనిముట్లకు ప్రస్తుతం గిరాకీ ఏర్పడింది. అయితే తాము తయారు చేసే పనిముట్లకు డిమాండ్ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని తయారీదారులు వాపోతున్నారు. ముడిసరుకు ధరలు పెరగడంతో పాటు తయారీదారులు ఏటేటా తగ్గిపోవడం, అవసరమైన సహాయకులు దొరకకపోవడంతో పనిభారం పెరుగుతోందని అంటున్నారు. బొగ్గుల కొలిమిని తయారు చేయడానికి ఒకరు, ఇనుప ముక్కలను బొగ్గులలో ఉంచడానికి మరొకరు, ఎర్రగా కాలిన ఆ ఇనుప ముక్కలను సుత్తి, సమ్మెటలతో కొట్టడానికి మరొకరు పనిచేస్తూ ఉంటారు. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారుగా 10 నుంచి 12 కమ్మరశాలలు ఉన్నాయి. ముఖ్యంగా భీమవరం, నరసాపురం, మొగల్తూరు, రాయకుదురు, ముప్పర్తిపాడు తదితర ప్రాంతాల్లో పెద్ద కమ్మరి శాలలు ఉన్నాయి. వీటిలో నిపుణులైన పనివారు 20 నుంచి 25 మంది వరకు ఉంటారు. మొత్తంగా వారికి సహాయకులుగా 40 నుంచి 60 మంది వరకు పనిచేస్తుంటారు. వీటిలో ముఖ్యంగా వీరవాసరం మండలం రాయకుదురులోని కమ్మరిశాల సుమారుగా 100 సంవత్సరాల నుంచి రైతులకు పనిముట్లు తయారుచేస్తూ సేవలందిస్తోంది. జిల్లాలో పలు ప్రాంతాలు నుంచి రైతులు ఇక్కడకు వచ్చి పరికరాలు, ఇతర వ్యవసాయ పనిముట్లు ఇక్కడ కొనుగోలు చేయడం, లేదా వారికి కావాల్సిన విధంగా తయారు చేయించుకుని తీసుకువెళుతుంటారు. వ్యవసాయ పనిముట్లకు అవసరమైన కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, తవ్వుగళ్లతో పాటు వంట సామగ్రికి ఉపయోగించే కత్తి, మటన్ కత్తులు వంటి పరికరాలను తయారు చేస్తారు. అయితే ప్రస్తుతం యంత్రాలతో తయారైన పరికరాలు మార్కెట్‌లోకి రావడంతో కమ్మర్లు తయారు చేసిన పరికరాలకు డిమాండ్ తగ్గిందనే చెప్పాలి.

యంత్రాలతో తట్టుకోలేని పోటీ

వివిధ రకాల యంత్రాలతో వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరలకు తయారు చేసి మార్కెట్‌లో విక్రయించడం వల్ల కమ్మర్లు తయారు చేసే వస్తువులు నాణ్యతగా ఉన్నప్పటికీ కొనుగోలు చేసేవారు తగ్గిపోయారు. అలాగే గతంలో ఇనుముతో తయారు చేసిన చాకులు, కత్తిపీటల స్థానంలో స్టీలుతో తయారైన వస్తువులు వినియోగించడం వల్ల తాము తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేసేవారే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు సంఘం లేకపోవడం వల్ల ఐక్యత లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏడాదికి రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టి వ్యవసాయ పనిముట్లు, ఇంటి అవసరాలకు అవసరమైన పరికరాలను తయారు చేసి విక్రయిస్తే రూ.3 లక్షల వ్యాపారం జరిగేదని చెబుతున్నారు.


సుత్తి, శానం తయారు చేస్తూ..


మటన్ కత్తుల తయారీలో..


కత్తికి పదును పెడుతూ..

పెరిగిన ముడి సరుకు ధరలు



ఇనుప వస్తువుల తయారీకి అవసరమైన ఇనుము, బొగ్గు ధరలు పెరిగిపోయాయి. కిలో ఇనుము రూ.90, బొగ్గు బస్తా రూ.650కు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరో పనిచేయడం రాక, ప్రత్యామ్నాయం లేక ఈ వృత్తినే నమ్ముకుని కష్టపడుతున్నాం. ఉపాధి హామీ పనులకు ఉపయోగించే పరికరాల తయారీ అర్డరు ఇస్తే కొంతవరకు మాకు ఉపాధి లభిస్తుంది. గడ్డపారలు, కత్తులు, పారలు నాణ్యతగా తయారు చేస్తాం. మా దగ్గర కమాన్ కట్టలతో తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు సిద్ధంగా ఉంటాయి. రైతులు సొంతంగా ఇనుప ముక్కలు తెచ్చుకున్నా పనిముట్లు తయారు చేసి ఇస్తాం.

– బొడ్డు సాయి, తయారీదారుడు

తాతల కాలం నుంచీ ఇదే వృత్తి



నా తండ్రి హయాంలో నరసాపురం నుంచి రాయకుదురు వచ్చి స్థిరపడ్డాం. గత 80 ఏళ్ల నుంచి ఇక్కడ కమ్మరి శాలను నడుపుతున్నాం. జిల్లాలో చాలా ప్రాంతాల నుంచి మా వద్దకు వచ్చి వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేసుకుని తీసుకువెళుతుంటారు. ఒకోసారి వారికి అవసరమైన రీతిలో తయారు చేయించుకుని మరీ తీసుకుని వెళుతుంటారు. ఈ వృత్తిలోకి రావడానికి యువత ఆసక్తి చూపడం లేదు. యంత్రాల ద్వారా తయారు చేసిన వస్తువుల కంటే మేము తయారు చేసిన ఇనుప వస్తువులు ఎంతో నాణ్యతగా ఉంటాయి.

– బొడ్డు నాగేశ్వరరావు, కమ్మరి కొలిమి యజమాని, రాయకుదురు

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

ఆర్‌జేడీ జే నాగమణి


హెచ్‌ఎంల సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

తణుకు టౌన్: పాఠశాలల నిర్వహణలో విద్యార్థులకు చదువుతో పాటు వారి భద్రతకు ప్రధానోపాధ్యాయులు ప్రాధాన్యమివ్వాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకురాలు జే నాగమణి సూచించారు. తణుకులోని వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన తణుకు డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయుల సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సదస్సుకు డీవైఈవో డీ మురళీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆర్‌జేడీ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, తరగతి ఉపాధ్యాయులపై ప్రధానోపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థులందరికీ బేసిక్స్ బోధనపై దృష్టి సారించాలని కోరారు. డివిజన్ పరిధిలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించడంపై తణుకు డివైఈవోను ఆర్‌జేడీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నేలపాటి వెంకట రమణ, ఇరగవరం ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్ట్ దుర్మరణం

మరో యువకుడికి తీవ్ర గాయాలు



కిషోర్‌రెడ్డి (ఫైల్), తీవ్రగాయాలతో ఉన్న కిషోర్‌రెడ్డి

పెంటపాడు: పెంటపాడులోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మోటార్‌సైక్లిస్టు దుర్మరణం పాలయ్యాడు. కాగా ఈ ప్రమాదంలో మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పెంటపాడు ఎస్సై ఎన్.శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముదునూరుపాడుకు చెందిన పులగం కిషోర్‌రెడ్డి (21), అతని స్నేహితుడు సత్తి మణికంఠరెడ్డి పెంటపాడు నుంచి ముదునూరుపాడుకు బైక్‌పై వెళుతున్నారు. పెంటపాడులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు వచ్చేసరికి తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపు వేగంగా వెళుతున్న కారు వీరి మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న కిషోర్‌రెడ్డి, మణికంఠరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని గూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా అక్కడ చికిత్స పొందుతూ కిషోర్‌రెడ్డి మృతి చెందాడు. మరో యువకుడు మణికంఠ రెడ్డిని మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. కిషోర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ఎస్.శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీసుదర్శన హోమం


ఈడూరులో సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


ఈడూరులో గరుడవాహనంపై కొలువుదీరిన శ్రీవరాల వెంకన్న

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఉదయం బస్వా శ్రీనివాసు, విజయలక్ష్మి దంపతులతో శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, మేలు కొలుపు, తోమాలసేవ జరిపారు. కలిదిండి రంగరాజు, పార్వతి దంపతులతో స్వామివారికి సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల వెంకట నారాయణరావు, గోవిందమాల భక్తులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా.. గరుడవాహన సేవ

ఈడూరులో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి గరుడవాహన సేవ నేత్రపర్వంగా జరిగింది. గ్రామానికి చెందిన దారా బత్తుల శ్రీనివాస్, మంగతాయారు దంపతులతో గరుడవాహనసేవ నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన గరుడ వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి, మేళతాళాలు, గోవింద నామస్మరణల నడుమ శ్రీస్వామివారి గరుడోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో శ్రీస్వామివారి వాహన సేవను జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆకుల వెంకటనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయేతర మేతలపై దృష్టి పెట్టండి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం: పశుపోషణలో ఉన్న రైతులు సంప్రదాయేతర మేతలపై దృష్టి పెట్టాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ కోరారు. వెంకట్రామన్నగూడెంలోని గేదెల పరిశోధన స్థానంలో బుధవారం నిర్వహించిన రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కువ శాతం పశుసంపద మేత కొరత బారిన పడి చిక్కిశల్యమవుతోందన్నారు. తద్వారా ఉత్పాదక శక్తి తక్కువగా ఉంటుందన్నారు. దేశంలో సగటున 35 శాతం దాణా కొరత, 30 శాతం పచ్చగడ్డి కొరత, 25 శాతం ఎండు గడ్డి కొరతతో పశువులు బాధపడుతున్నాయన్నారు. ఈ కొరతను నివారించాలంటే ప్రత్యామ్నాయ పశుగ్రాసాల సాగుపై దృష్టి సారించాలన్నారు. గేదెల పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాకర్ కె.ఆనందరావు మాట్లాడుతూ ప్రతి పాడి రైతు తనకున్న భూమిలో పదో వంతు మేలుజాతి పశుగ్రాసాల కోసం వినియోగించాలన్నారు. భూమిలేని నిరుపేద రైతాంగం హైడ్రోఫోనిక్స్ అజోల్లా, పెరట్లో పశుగ్రాస చెట్లు అయిన అవిశ, సుబాబుల్ చెట్లను పెంచుకోవాలన్నారు. ఈ గ్రాసాల వల్ల పాడి పశువుల్లో ఉత్పాదకతను పెంచవచ్చన్నారు. పశుగ్రాసాల మేత సాగు, వాటి వినియోగంపై శిక్షణకు హాజరైన ఎస్‌సీ రైతులకు విశదీకరించారు. డాక్టర్ కె.నాగరాజకుమారి, గూడెం ఏడీ బి.అనిల్‌కుమార్, గణపవరం ఏడీ నాయక్, కేవీకే శాస్త్రవేత్త వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డివామి

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిధిలోని అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టు శివారు గరువు ప్రాంతంలో ఉన్న రెండు గడ్డివాములు మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. చిత్రావిచెరువు గట్టున నివాసం ఉంటున్న స్థానికులకు గరువు ప్రాంతంలో పొలం గట్టున మంటలు కనిపించడంతో హుటాహుటిన అక్కడికి పరుగున వెళ్లారు. గుబ్బల శ్రీను, గుబ్బల మంగలకు చెందిన రెండు గడ్డివాములు తగలబడుతున్నట్లు గుర్తించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అప్పటికే రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. మొత్తం ఎనిమిది ఎకరాల గడ్డివాము దగ్ధం కావడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆకతాయిలు కావాలనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అగ్ని ప్రమాదం వల్ల రూ.80 వేల ఆస్తినష్టం సంభవించిందని బాధిత రైతులు చెబుతున్నారు.

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం రూ.7.63 లక్షలు



కైకలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి 62 రోజుల కాలానికి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.7,63,487 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కేవీ గోపాలరావు బుధవారం చెప్పారు. గుడివాడ దేవదాయశాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగిందన్నారు. ఆలయ ప్రాంగణంలో కొబ్బరి చెక్కల సేకరణ హక్కులకు టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించగా పాటదారులు ఎవరూ రాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, పందిరిపల్లిగూడెం శ్రీపెద్దింట్లమ్మ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధి.. గొంతు వాపు

- వర్షాకాలంలో పశువులకు సోకుతున్న వ్యాధి
- సకాలంలో గుర్తిస్తే నివారణ సులభతరం
- పశువుల వ్యాధులపై రైతులు అవగాహన పెంచుకోవాలంటున్న పశువైద్యులు



భీమవరం : పాడి రైతులకు పశువులే జీవనాధారం. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ పాడిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆదాయాన్ని పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో 1,78,137 గేదెలు, 45,539 ఆవులు ఉన్నాయి. పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో వ్యాధితీవ్రత ఎక్కువై పశుమరణాలు సంభవిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉంటే వెంటనే నిరోధించేందుకు వీలు కలుగుతుందని పశువైద్యులు చెబుతున్నారు.

గేదెల్లోనే ఎక్కువ

వర్షాకాలంలో గేదెలకు సోకే ప్రాణాంతకమైన వ్యాధుల్లో గొంతువాపు ఒకటి. ఈ వ్యాధి పందుల్లో తరచుగా, గొర్రెలు, మేకల్లో చాలా అరుదుగా కనిపిస్తోంది. ఈ వ్యాధి ఏడాది పొడవునా ఎప్పుడైనా వ్యాపించే అవకాశం ఉంది. అయితే ఎక్కువగా వర్షాకాలంలో దీనిని గుర్తించవచ్చు. నదీ పరివాహక ప్రాంతాలు, డెల్టాలు, వరిసాగు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఉండే గేదెలకు వ్యాధి సోకే అవకాశం ఎక్కువ. ఇది ఒకరకమైన సూక్ష్మజీవి ద్వారా పశువులకు వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు

అనేక సందర్భాల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండి వ్యాధి సోకిన 8 నుంచి 24 గంటల వ్యవధిలో పశువు చనిపోతుంది. వ్యాధి ప్రారంభ దశలో పశువు నీరసంగా ఉంటుంది. తరువాత నడవలేకపోవడం, అధిక జ్వరం, నోటి నుంచి సొంగ కారడం, ముక్కు నుంచి చిక్కటి ద్రవం స్రవించడం, కళ్లు ఎరబ్రడి నీరు కారుతూ ఉండటం వంటివి ప్రధాన లక్షణాలు. ముందుగా గొంతు భాగంలో వాపు ఉండి తరువాత వాపు చెంపలు, మెడ, ముందు కాళ్ల మధ్య భాగం, పొట్ట కింద భాగం వరకూ విస్తరిస్తుంది. పశువు ఆయాసపడుతూ శ్వాస పీలుస్తుంది. శ్వాస పీల్చే సమయంలో గుర్ గుర్ మనే శబ్దం వస్తుంది. సాధారణంగా ఈ దశలో పశువు నాలుక బయటకు తీస్తూ శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. ఈ దశ తరువాత కొన్ని గంటల వ్యవధిలో పశువు చనిపోతుంది. ఈ దశలో కోలుకోవడం చాలా అరుదు.

వ్యాప్తి ఇలా..

వ్యాధి సోకిన పశువుల నుంచి కారే సొంగ, ముక్కు నుంచి స్రవించే ద్రవాల ద్వారా వ్యాధి కారక బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. తరచుగా వ్యాధి సోకే ప్రాంతాల్లో నివసించే ఐదు శాతం పశువులు ఈ వ్యాధికి వాహకాలుగా ఉంటాయి. అలసిపోయిన, ఒత్తిడికి గురైన పశువులకు ఈ వ్యాధి త్వరగా సోకుతుంది. సాధారణంగా కలుషితమైన మేత, గాలి ద్వారా వ్యాధి కారకం పశువుల శరీరంలోకి ప్రవేశిస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన క్రిమి త్వరగా విభజన చెంది ఎండోక్సిన్స్ అనే విషపదార్థాలను విడుదల చేస్తుంది. ఇది రక్తంలోకి ప్రవేశించిన అనంతరం వ్యాధి లక్షణాలు బయటపడతాయి.

అందుబాటులో టీకాలు



వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పశువైద్యుడి సలహామేరకు సల్ఫామైడ్స్, టెట్రాసైక్లిన్, పెన్సులిన్, క్లోరామ్ ఫినికాల్ వంటి యాంటిబయాటిక్ మందులు ముందుగా వాడితే ఫలితం ఉంటుంది. వ్యాధి ముదిరిన తరువాత చికిత్స పెద్దగా ఫలితం ఇవ్వదు. అన్ని పశువైద్యశాలలు, గ్రామీణ పశువైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉంటాయి.

– పి.సుధీర్‌బాబు, ఏడీ, పశుసంవర్ధ శాఖ, భీమవరం

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు



పెదతాడేపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందజేస్తున్నామని పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. బుధవారం మండలంలోని పెదతాడేపల్లి మహాత్మాజ్యోతిరావు పూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నవరం మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నతంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.హనుమ, స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పి.సత్యవతి, స్కూల్ ప్రిన్సిపల్ జి.సూర్యకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సంతాపం

తణుకు: ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు తణుకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన సంతాప సభలో నాయకులు పాల్గొని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రైలు ప్రమాదంలో 20 మంది ప్రయాణీకులు మృతి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కడలి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పెంటపాడు: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ వ్యవసాయకార్మికసంఘ జిల్లా నాయకులు కళింగ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం మండల కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కౌలు రైతుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసిల్దార్ వెంకటేశ్వర్లకు అందజేశారు. వంకా అప్పారావు, కొణతాల నాగరాజు, దేపల్లి సుబ్బారావు, కిల్లాడి ఏసు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

అత్తిలి: ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని, ప్రభుత్వం ఫీజులను నియంత్రించాలని పలువురు సామాజిక సేవ కార్యకర్తలు కోరుతున్నారు. ఒక్కో పాఠశాల ఒక్కో విధంగా విద్యార్థులనుంచి అధిక ఫీజులు వసూలు చేయడంతో సామాన్య, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలను తనిఖీచేసి, ఫీజులను నియంత్రించాలని దిరిశాల సత్యం సేవా సమితి అధ్యక్షుడు దిరిశాల మునేశ్వరరావు కోరారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



యర్రంశెట్టివారిపాలెంలో వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారి పాలెంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి 14వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యర్రంశెట్టి బాబులు, నాగముత్యమాంబ దంపతులు, కూనపరెడ్డి చంటి దంపతులు, యర్రంశెట్టి మోహనరావు దంపతులు, నందుల సత్యప్రసాద్ దంపతులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

పాలకోడేరు: ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడినందున గ్రామంలో అన్ని వర్గాల వారు కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించాలని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు హితవు పలికారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బుధవారం శృంగవృక్షం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారిని గేలి చేయడం గానీ, గెలిచిన వారి బ్యానర్లు, ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం గానీ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం గానీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బంగారు భవితే లక్ష్యం

- దివ్యాంగులు బడిబాట పట్టేలా సమగ్రశిక్ష అధికారుల సర్వే
- ప్రత్యేక అవసరాలుగల బాలలకు వెసులుబాటు

అత్తిలి: ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా వారికి మానసిక, శారీరక తర్ఫీదులు ఇస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. గత ఏడాది సమీప పాఠశాలల్లో విద్య అభ్యసనకు సిద్ధమైంది. శారీరక, మానసిక వైకల్యం బారినపడిన పిల్లలకు ఇప్పటి వరకూ తమను ప్రత్యేకంగా విభజించారనేఉ బావన కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు విధివిధానాల అమలు కూడా ప్రారంభించింది. ప్రాథమిక పాఠశాల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మాటలు రాని మానసికంగా ఎదుగుదల లేని, నడవలేని పిల్లలు ఇళ్లలో ఉండి మరింత మానసికంగా కుండిపోకుండా వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించారు. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధించారు. ఈ తరహా విద్య, శిక్షణలో వృద్ధిచెందిన వారిని ఆపై సాదారణ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరుగా కాకుండా వారిలో అందరూ సమానమనే భావనను పెంపొందింపజేసుందుకు సాధారణ విద్యార్థులతోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన చదువు



అత్తిలిలో చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం



అత్తిలిలో ప్రత్యేక అవసరాలుగల పిల్లల సర్వే చేస్తున్న దృశ్యం(ఫైల్)



అత్తిలిలో ఆటపాటలతో విద్యను అందిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయిని

చెప్పించేలా చర్యలు తీసుకుంది. దీని కోసం మండలానికి ఒక పాఠశాల ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాల్లో విలీనం చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలతో పిల్లలకు విద్య బోధిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు విద్యాదీవెన వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియో థెరపిస్టులు, వ్యాయామం, స్పీచ్‌థెరపీ, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఐఈఆర్‌టీలు, ఫిజియో థెరపిస్టులు వారి పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

బహుళ ప్రయోజనాలు...

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చేరితే ప్రతి నెలా రూ.300 రవాణాభత్యం చెల్లిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ట్యాబ్‌లతో పాటు తొమ్మిది , పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం ఏడాదికి రూ.9వేల నుంచి 11వేలు అందజేస్తారు. వైకల్యశాతం అధికంగా ఉంటే సదరమ్ ధ్రువపత్రంతో పింఛను వస్తుంది. బస్సు, రైల్వేలో బస్సు పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారి ఇంటికి వచ్చి బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చి నట్టే హాజరు నమోదు అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి....



ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగుల బడిబాట పట్టేలా సర్వే కార్యక్రమం చేపట్టాం. సర్వేలో జిల్లా వ్యాప్తంగా 605 మంది చిన్నారులను గుర్తించాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్య బోధిస్తాం. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్‌స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం.

పి శ్యాంసుందర్, జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్

బడిఈడు పిల్లలను నమోదు చేశాం



మండలంలో ప్రత్యేక అవసరాలుగల పిల్లల సర్వే చేపట్టగా 60 మందిని గుర్తించాం. వీరి వివరాలను చైల్డ్‌ఇన్ఫోలో నమోదు చేశాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటపాటలతో విద్యను బోధించడంతో పాటు ప్రభుత్వ పరంగా వివిధ రకాల అలవెన్సులు, వారికి అవసరమైన ఉపకరణాలు అందజేస్తున్నాం. గతేడాది పదో తరగతి పరీక్షలకు 10 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు హాజరు కాగా వీరిలో 8 మంది ఉత్తీర్ణత సాధించారు.

కె రమ్య, ఐఈఆర్టీ ఉపాధ్యాయిని, అత్తిలి.

దివ్యాంగుల పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు



దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలకు పట్టణంలోని భవిత సెంటర్‌లో ప్రతి బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని ఫిజియోథెరపీస్ట్ అల్లు శ్రీకృష్ణ మహేష్ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలను నిర్వహించారు. శ్రీకృష్ణ మహేష్ మాట్లాడుతూ ఇంటి వద్ద దివ్యాంగుల పిల్లలకు ప్రతి రోజు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయాలన్నారు. కండరాలు బిగుసుకోపోవడం, మెడ నిలబెట్ట లేకపోవడం, నడక సరిగా లేకపోవడం, కూర్చోలేకపోవడం వంటి సమస్యలను అధిగమించేందుకు ఫిజియోథెరపీ సేవలు ఎంతో అవసరమన్నారు. కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రత్యేక విద్యతో పాటు మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ చేస్తారని వెల్లడించారు. ప్రభుత్వం అందించే వివిధ రకాల అలవెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

24న గూడెం మండల పరిషత్ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్‌ఎస్.శర్మ తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

విత్తనాలు సిద్ధం.. సాగుకు సన్నద్ధం

- తొలకరి ఖరీఫ్ పనుల ప్రారంభం
- విత్తన శుద్ధిపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారుల సూచన

ఇరగవరం: తొలకరి వానలు మొదలయ్యాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ముందస్తు ఖరీఫ్ సాగు కోసం నారుమళ్లు జోరుగా సిద్ధం చేశారు. మండలంలోని కె ఇల్లిందలపర్రు, గోటేరు, రేలంగి, ఇరగవరం గ్రామాలలో ఇప్పటి వరకు సుమారు 210 ఎకరాలలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచింది. దీంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమై నారుమడుల పనులు ముమ్మరం చేశారు. జులైలో రెండు లేదా మూడో వారం నుంచి వరినాట్లు వేయనున్నారు.

నారుమడి తయారీ:

నారుమడి తయారు చేసుకోవడానికి వినియోగించే భూమిలో చివరి దుక్కులో ఐదు సెంట్ల భూమికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, కిలో పొటాషియమ్ చల్లాలి. ఆకుమడిలో ముంపు నీరు దిగేందుకు చిన్న చిన్న బోదెలు, ఆకుమడి చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో విత్తనాలు చల్లుకున్న తర్వాత మొదటి ఆకు విచ్చుకునే వరకు 10 రోజులు ఆరుతడి యాజమాన్యం నిర్వహించాలి.



ఇరగవరంలో మురుగు దమ్ముతో సిద్ధం చేసిన నారుమళ్లు

11వ రోజు మొదటి ఆకు విచ్చుకున్నాక నారుమడిలో నీరు ఉండేటట్లు చూసుకోవాలి. ఇలా నారుమడి వేసిన 21–25 రోజుల్లో నాణ్యమైన నారు తయారవుతుంది.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోను, కొన్ని ప్రైవేట్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. విత్తన శుద్ధి చేస్తే నాణ్యమైన నారు రావడమే కాకుండా దిగుబడి బాగా వస్తుంది. ఎకరాకు సరిపడా నారి కావాలంటే 20 నుంచి 30 కేజీల విత్తనాలు అవసరమవుతాయి. విత్తన శుద్ధి తర్వాతే నారు మడులు వేయాలి. నారుమడి తయారు చేసేటప్పుడు విత్తనాల సంచిని, ట్యాగ్‌ను, రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలి.

వై రాఘవేంద్రరావు, వ్యవసాయాధికారి, ఇరగవరం

ఉపాధి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

తణుకు: గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం ఆధ్వర్యంలో ఉపాధి కార్మికుల సమస్యలు తెలుసుకోవడం కోసం తణుకు మండలం కొమరవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో నిధులు ప్రతి బడ్జెట్‌లో తగ్గిస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వంలో ఉపాధి హామీ కార్మికులకు నేటికీ కనీస వేతనం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత కష్టపడినా రోజుకి రూ. 100 రావడం లేదన్నారు. గత ఏప్రిల్ నుంచి ఉపాధి కార్మికులకు డబ్బులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని, ఏడాది 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు గార రంగారావు తదితరులు పాల్గొన్నారు.



కొమరవరం గ్రామంలో మాట్లాడుతున్న పీవీ ప్రతాప్

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

తణుకు టౌన్: విద్యార్థులు వారి భవిష్యత్‌కు ఎంతో కీలకమైన ఇంటర్ మీడియట్ విద్యలో కూడా తమ ప్రతిభను చాటుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ), ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాదికారిణి జే నాగలక్ష్మీ కోరారు. బుధవారం తణుకులోని వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో జరిగిన తణుకు డివిజన్‌లో పదో తరగతి పరీక్షలలో మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమానికి తణుకు జోన్ డిప్యూటీ విద్యాశాఖాదికారి డీ మురళీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 590 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అదే స్ఫూర్తితో ఇంటర్, ఇతర ఉన్నత విద్యలో రాణించాలన్నారు. కాకినాడ జోన్‌లో పదో తరగతి పరీక్షలలో గతం కంటే ఈసంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. చదువుకునే విద్యార్థులు సెల్ ఫోన్‌లకు, చాటింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. సమయ పాలన పాటిస్తూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రణాళిక బద్ధంగా చదివితే అత్యుత్తమ మార్కులు సాధించడం కష్టమేమి కాదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నేలపాటి వెంకట రమణ, ఇరగవరం ఎంఈవో ఎస్ శ్రీనివాసరావు, వివేకానంద గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, తణుకు డివిజన్‌లోని వివిధ మండలాల విద్యా శాఖాదికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

విద్యతోనే ఉన్నత స్థానం

ఉండి: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే మనిషి ఉన్నత స్థాయికి చేరుకుంటాడని చెరుకువాడ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గాదిరాజు వెంకటరామకృష్ణంరాజు అన్నారు. బుధవారం చెరుకువాడ పెదపేట ప్రాథమిక పాఠశాలలో దాతలు సాగిరాజు సాంబశివరాజు, మంగతాయారుల ఆర్థిక సహాయంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి పంపిణీ సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మంగతాయారు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జడ్పీ హెచ్‌ఎం రామకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలో చెడు వ్యసనాల జోలికి పోకూడదన్నారు. బాల్యంలో చదవు పట్ల విద్యార్థులు శ్రద్ధ కలిగి ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ విద్యలో రాణించే వారికి జీవితంలో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, ముదునూరి శివరామరాజు, గొట్టుముక్కల రాము, పెన్మెత్స రంగప్రసాద్, రామాంజనేయులు, బూనే, సీఆర్‌పీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

నరసాపురం: విద్యార్థులు చదువు విలువ తెలుసుకొని కష్టపడి చదవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. పట్టణంలోని 31వ వార్డు నిప్పులేటి హైమావతి హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం విద్యా కిట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ఒరవడి కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సూర్యకుమారి మట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతీ ఏటా పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బళ్ల తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

ధాన్యం నగదు చెల్లించాలి

పెనుగొండ: రైతుల ధాన్యానికి నగదు సత్వరం చెల్లించాలని సీపీఎం నాయకులు తలుపూరి బుల్లబ్బాయి అన్నారు. కౌలు, పేద రైతులకు తక్షణమే ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఐపీ శెట్టికి వినతి పత్రం అందించారు. మండలంలో ఇప్పటి వరకూ కేవలం రూ.7 కోట్లు మాత్రమే చెల్లింపులు అయ్యాయని, మరో రూ.55 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నెలలు తరబడి డబ్బులు చెల్లించకపోవడం వలన తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉన్నతాధికారులు రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, పి.మోహన్‌రావు, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.



ఆచంటలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

మేనరిక వివాహాలతో అనర్థమే

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్యజీవన్

పాలకొల్లు అర్బన్: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వం ద్వారా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహమని డాక్టర్ ఎం.నవ్యజీవన్ తెలపారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. సాధారణంగా ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటాయని, కానీ ఈ సికిల్ సెల్ ఎనీమియాలో రుగ్మత కారణంగా ఎర్ర రక్త కణాలు అర్ధ చంద్రాకారంగా, కొడవలి రూపంలో ఉంటాయన్నారు. ఈ కణాలు ఆక్సిజన్ సరఫరాకి ఆటంకం కలిగిస్తాయన్నారు. ఈ కణాలు తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతాయన్నారు. మేనరికపు వివాహాలు చేసుకోవద్దని తెలిపారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో నివసించే వారికి వస్తుందన్నారు. ఈ వ్యాధిలో రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం, రక్తహీనత, తీవ్రమైన కీళ్ల నొప్పులు, శ్వాస సమస్యలు, అలసట, గర్భధారణలో ఇబ్బందులు, అంగవైకల్యం తదితర లక్షణాలు బయట పడతాయన్నారు. ఈ లక్షణాలు గలవారు తక్షణం వైద్యుడిని సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకొని, మందులు వాడాలని డాక్టర్ నవ్యజీవన్ కోరారు. ఇది అంటువ్యాధి కాదని జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్లు ఎస్కే అమలేశ్వరరావు, డి.కమల, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం